క్లుప్తంగా

ఓపెన్ కాని ఉచిత ఇసుక యాప్..

భామిని: మండలంలోని కాట్రగడ – బి వద్ద ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్ యార్డు వద్ద ఇసుకు బుకింగ్ కోసం అధికారులు పడరాని పాట్లు పడ్డారు. ఉచిత ఇసుక విధానం ప్రభుత్వం ప్రకటించిన రెండో రోజు శుక్రవారం కూడా యాప్ ఓపెన్ కాలేదు. తహసీల్దార్ నిమ్మల శేఖరం, డీటీ రమేష్‌కుమార్, ఆర్ఐ రాంబాబు, మైన్స్ ఆర్ఐ శిరీష, సచివాలయ ఉద్యోగులు గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ యాప్ ఓపెన్ కాకపోవడంతో విక్రయాలు జరగలేదు.

ఉచిత కుట్టు శిక్షణ పూర్తి


సర్టిఫికెట్లు అందుకున్న శిక్షణార్థులతో నిర్వాహకులు

భామిని: మండల కేంద్రంలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శుక్రవారంతో పూర్తయింది. దీంతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు కుట్టు పని చేసుకుంటూ ఆర్థిక స్వావలంబన పొందాలని ఆకాంక్షించారు. శిక్షకురాలు రమాదేవి మాట్లాడుతూ, మహిళలకు ఉపయోగపడే శానిటరీ ప్యాడ్స్ తయారు చేయాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ


డీఎస్పీ రాంబాబు

పాలకొండ: పాలకొండ సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా ఎం.రాంబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ జీవీ కృష్ణారావుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాంబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. అంతకుముందు కోటదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పాలకొండ సీఐగా పనిచేసిన అనుభవంతో, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. పలువురు పోలీస్ అధికారులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యలు తెలియజేయండి..


ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మేనేజర్, సిబ్బంది

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మేనేజర్ జయరామ్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డు పరిధిలో శుక్రవారం సాయంత్రం పర్యటించి, ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. పారిశుధ్యం, తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షిత్‌రాజుకు అభినందనలు


పరీక్షిత్‌రాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జియ్యమ్మవలస: పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైనందుకు మండల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, నాయకులు లోలుగు నారాయణరావు, మరడాన కిశోర్, కెంగువ వెంకటనాయుడు, బాబూ భువనమోహనరావు, తదితరులు ఉన్నారు.

రహదారి మరమ్మత్తులు చేపట్టరూ..


శ్రీకాకుళం–పార్వతీపురం రహదారిలో నిలిచిన నీరు

గరుగుబిల్లి: పరిధిలో మండల పరిధిలోని పార్వతీపురం–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఖడ్గవలస జంక్షన్, ఉల్లిబద్ర సమీపంలో రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రోడ్డు గోతుల్లో నీరు చేరడంతో రాత్రి సమయంలో గుంతలను గుర్తించ లేక ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకుగాను స్థానిక ఎస్సై రమేష్‌నాయుడు ట్రాక్టర్‌తో గ్రావెల్‌ను తెప్పించి గోతులను తాత్కాలికంగా పూడ్చారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హామీలు ఘనం.. అమలు శూన్యం

- కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా అమలు కాని హామీలు
- నియోజకవర్గ ప్రజల ఎదురుచూపు
- గత ప్రభుత్వం చేపట్టిన పనులకే మరోసారి శంకుస్థాపన

గుమ్మలక్ష్మీపురం:

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలుకు నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఊదరగొట్టిన టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నియోజకవర్గ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. ముఖ్యంగా పూర్ణపాడు–లాబేసు వంతెన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని, ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, గుమ్మిడిగెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణం, గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మాణం, తదితర హామీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా వీటిలో ఏ ఒక్క హామీ అమలుకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.


2024 జనవరి 29న ఎగువ తాడికొండ–చాపరాయి జంగిడిభద్ర గ్రామాల మధ్య బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గత ప్రభుత్వంలో చేపట్టిన పనులనే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎగువ తాడికొండ–చాపరాయి జంగిడిభద్ర, కొండుకుప్ప రోడ్డు–కానసింగి, రెల్ల–కొత్తవలస, కంబగూడ–డొంగరికిక్కువ గ్రామాల మధ్య రహదారుల నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన పనులనే మరలా ప్రారంభించారు తప్ప కొత్త పనులు చేపట్టలేదు.

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇచ్చిన హామీల్లో కొన్ని..

- పూర్ణపాడు–లాబేసు వంతెన నిర్మాణం
- ఏనుగుల సమస్యకు పరిష్కారం
- గుమ్మిడి గెడ్డపై మినీ రిజర్వాయర్ నిర్మాణం
- గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం


2024 జులై 4న ఎగువ తాడికొండ–చాపరాయి జంగిడిభద్ర బీటీరోడ్డు నిర్మాణానికి మరోసారి భూమిపూజ చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రాణాలు పోతున్నా..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాతనే కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చెందిన దినసరి కూలీ వాన శివున్నాయుడును ఏనుగులు తొక్కి చంపాయి. అలాగే రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, వాణిజ్య పంటలను నాశనం చేస్తున్నాయి. మరోవైపు తూర్పుముఠా పరిధిలోని జరడ ప్రాంతంలో మరో ఏనుగుల గుంపు సంచరిస్తుండటంతో ఆ ప్రాంత గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. వారు సాగు చేస్తున్న పంటలను సైతం నాశనం చేస్తున్నాయి. అయినా ఏనుగుల సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడలేదు.

ఇది ముంచే ప్రభుత్వం..

- అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని హామీలు అమలు చేస్తామన్న కూటమి నాయకులు
- వంద రోజులు పూర్తయినా ఒక్క హామీ అమలు కాని వైనం
- మండిపడుతున్న ప్రజానీకం

పాలకొండ రూరల్: మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పాలకొండను బంగారు కొండగా మారుస్తాం.. ఇక్కడి అపారమైన వనరులు అందిపుచ్చుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తాం.. పాలకొండ, సీతంపేట ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా తీర్చిదిద్దుతాం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీలన్నీ నెరవేరుస్తాం.. ఈ పలుకులన్నీ ఎక్కడో... ఎప్పుడో విన్నట్లు ఉంది కదా.. ఈ హామీలన్నీ ఎన్నికల ముందు పాలకొండ బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలసి ప్రస్తుత నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఇచ్చినవే. అక్కడితో ఆగకుండా నియోజవర్గంలోని సీతంపేట, భామిని మండలాల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొందని.. ఇంటింటికీ రక్షిత నీరు అందించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని.. జగన్ మోహన్‌రెడ్డి హయాంలో గిరిజనులకు అన్యాయం జరిగిందని, దీని నివారణకు జీఓ 3 అమలుకు ప్రయత్నిస్తామని హామీలు గుప్పించారు. ఏనుగుల సమస్య నేపథ్యంలో పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఈ కోవలోనే రద్దు కాబడిన గిరిజన పథకాలు పునరుద్ధరిస్తామని, తాము అధికారంలోకి వస్తే ఇక్కడి యువకులకు మంచి భవిష్యత్ కల్పిస్తామని ఆశ పెట్టారు.


పాలకొండను బంగారుకొండగా మారుస్తా!

కూటమి నాయకులు ఇచ్చిన హామీలపై ఓ పత్రికలో కథనం (ఫైల్)

వంద రోజులు పూర్తయ్యాయి...

గట్టిగా....పనిచేస్తామని చెప్పి వంద రోజులు పూర్తయ్యాయి. అయినప్పటికీ ఒక్క హామీ కూడా నెరవేరలేదు. కనీసం హామీలకు సంబంధించి ఒక ప్రకటన కూడా చేయడం లేదు. ఏజెన్సీ మాట అలా ఉంచితే ప్రస్తుతం పట్టణంలోనే తాగునీటి సమస్య నెలకొనడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. యువతకు ఎటువంటి ఉపాధి కల్పించలేదు. ఇప్పటికైనా కూటమి నాయకులు స్పందించి ఇచ్చిన హామీలు అమలు చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

120 మందికి కంటి పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): యస్ సొసైటీ సహకారంతో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి చైర్మన్ గోవింద హరి ఆధ్వర్యంలో కురుపాం మండలం మూలిగూడ జంక్షన్ వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయింది. శిబిరానికి వచ్చిన 120 మందికి కంటి తనిఖీలు నిర్వహించగా వారిలో 46 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మిగిలిన వారికి అవసరాన్ని బట్టి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పుష్పగిరి ఆస్పత్రి సీఎస్ఆర్ మేనేజర్ రమావేది మాట్లాడుతూ.. కంటి శస్త్రచికిత్సలను ఎంపిక చేసిన వారిని ఉచిత రవాణా, భోజన వసతులు కల్పించి శస్త్రచికిత్స కోసం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. శస్త్రచికిత్స అనంతరం మందులు, కళ్లద్దాలు కూడా ఉచితంగానే అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేత్రవైద్యులు వెంకటేష్, లిఖిత, బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ భీమశంకర్, కోఆర్డినేటర్ సత్యనారాయణ, యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ ఉన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నేత్ర వైద్య సహాయకులు సన్యాసమ్మ శుక్రవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే నేత్రాలకు సంబంధించి ఎటువంటి శస్త్ర చికిత్సలు (మెల్లకన్ను, గాయాల వలన వచ్చే కేటరాక్ట్) అవసరమైతే వారికి ఉచితంగా ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రులలో చికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు కొమరాడ మండలంలో 2300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశామని, వారిలో 93 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు.


కొమరాడ: విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న దృశ్యం

గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన

గరుగుబిల్లి: విద్యార్థినులు గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగివుండాలని స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని రావివలసలోని కేజీబీవీలో శుక్రవారం గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థినుల కిడ్నాప్, లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ఆపద సమయంలో 100 నంబరుకు ఫోన్ చేయడం ద్వారా పోలీసులు క్షణాల్లో అక్కడకు చేరుకుని రక్షిస్తారని అన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, నిందితులపై ఫోక్సో కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఛాయాదేవి, మహిళా పోలీస్ హేమలత తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

చిరు జల్లులతో ఊరట

భామిని: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. కొద్ది రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలతో అవస్థలు పడుతున్న ప్రజానీకం చిరుజల్లులకు సేదదీరారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భామిని: వంశధార నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ తెలిపారు. పెద్ద దిమిలికి చెందిన వ్యక్తి అక్రమంగా ట్రాక్టర్‌తో గురువారం రాత్రి ఇసుక తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గుమ్మలక్ష్మీపురం: అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలని టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు అన్నారు. శుక్రవారం ఆయన ఆ పార్టీ నాయకులు రామారావు, లక్ష్మణరావు, దాసు, రవి తదితరులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు. అధికారులు తీరుమార్చుకుని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు జాతీయ భాష అయిన హిందీ ప్రాముఖ్యత తెలుసుకోవాలని పార్వతీపురం ఐటీడీఏ డీడీ రుగ్మాండయ్య అన్నారు. మండలంలోని పి.ఆమిటి జీటీడబ్ల్యూ గర్ల్స్ స్కూల్‌లో హెచ్ఎం బి.లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందీ భాష జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందిందని, హిందీ నేర్చుకుంటే అంతర్జాతీయ స్థాయిలో ఆయా రంగాల్లో రాణించవచ్చన్నారు. విద్యార్థులు హిందీ చదవడం, రాయటం పట్ల దృష్టి సారించాలని సూచించారు. ప్రముఖ కవులు గంటేడ గౌరునాయుడు, మల్లిపురం జగదీష్, మంచుపల్లి గోపినాథ్‌లను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు నృత్య, నాటికల ప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, రాజేశ్వరి, గౌరీ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే భావితరాల భవిష్యత్

గరుగుబిల్లి: మొక్కల పెంపకంపైనే భావితరాల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివ్వాం గ్రామంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 2 వరకు అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. దోమల నివారణకు క్లోరినేషన్ చేయడంతో పాటు మురుగునీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న నాయకులు

పకడ్బందీగా పెసా ఎన్నికలు

సీతంపేట: పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా (పెసా) ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని పాలకొండ ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెసా చట్టం వల్ల గ్రామ పంచాయతీలకు సహజ వనరులపై పూర్తి అధికారం ఉంటుందన్నారు. ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 41 పంచాయతీల్లో 102 గ్రామసభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఏపీఓ చిన్నబాబు, ఎంపీడీఓ కె.గీతాంజలి, తహసీల్దార్ అప్పలరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

కోమటిపేటలో అన్నసమారాధన

పాలకొండ రూరల్: పట్టణంలోని కోమటిపేటలో కొలువుదీరిన అన్నపూర్ణ సమేత సనారీ విశ్వేశ్వర అవధూత స్వామివారి దివ్యజ్ఞాన మండపంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. అంతకుముందు విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు..

వీరఘట్టం: మండల కేంద్రంలోని ముచ్చర్లవీధిలో వినాయక ఉత్సవాల నేపథ్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. సుమారు నాలుగువేల మంది భక్తులు హాజరై స్వామి ప్రసాదం స్వీకరించారు.


వీరఘట్టం : ముచ్చర్లవీధిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

బాల్య వివాహాలు నేరం


బాల్య వివాహాలు చేపట్టవద్దంటూ ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న అధికారులు, సామాజిక కార్యకర్తలు

పాలకొండ రూరల్ : బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని సామాజిక కార్యకర్త తోట ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు ప్రజలు చైతన్యవంతులై మెలగాలంటూ శుక్రవారం స్థానిక నాలుగో వార్డు పరిధిలో సిబ్బందితో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహరహిత దేశాన్ని నిర్మించే క్రమంలో అన్నివర్గాల వారు తమతో కలసి ఉద్యమించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 91542 66714 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

అన్ని మండలాల్లో ఆర్టీసీ కార్గో సేవలు

గుమ్మలక్ష్మీపురం: అన్ని మండల కేంద్రాల్లో ఆర్టీసీ కార్గో సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆర్టీసీ జోనల్ అధికారి దివ్య తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న కార్గో సేవలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోనల్ పరిధిలో కార్గో సేవల ద్వారా రూ.24 కోట్ల వ్యాపారం లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.5.24 కోట్ల మేర వ్యాపారం చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం 50 కార్గో సేవా కేంద్రాలు ఉండగా మరిన్ని కార్గో కేంద్రాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆమె వెంట పార్వతీపురం ఆర్టీసీ డీఎం దుర్గా ఉన్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ కార్గో సేవలను పరిశీలిస్తున్న జోనల్ అధికారి దివ్య

హోరాహోరీగా క్రీడాపోటీలు

సీతంపేట: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ క్రీడలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. పాలకొండ నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో సుమారు 600 మంది విద్యార్థులు ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, తదితర పోటీల్లో తలపడ్డారు. ఏటీడబ్ల్యూఓ మంగవేణి, ఎంఈఓ సూర్య చంద్రమౌళి, హెచ్ఎం చంద్రరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఖోఖోలో తలపడుతున్న బాలురు

ఏం చేశారని ఈ ప్రచారం..!

- కూటమి నాయకుల ప్రచారంపై మండిపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏం మంచి చేసిందని.. నాయకులు ప్రచారం చేపడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు కొత్తకోట చంద్రశేఖర్, తదితరులు ప్రశ్నించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, అధికారం వెలగబెట్టి వంద రోజులు పూర్తయినా కనీసం రాష్ట్ర బడ్జెట్ పెట్టుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను మరిచిన కూటమి నాయకులను ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యురాలు పాలక ఉషారాణి, రొక్కం రారామావు, మేడిబోయిన చలపతి, కొత్తకోట ఆంజనేయులున్నారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

కొమరాడ: విద్యార్థులను తీసుకొస్తున్న పాఠశాల బస్సు అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగనప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం పార్వతీపురంలోని పాఠశాల నుంచి రాజ్యలక్ష్మీపురం గ్రామం వైపు వస్తున్న బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి డంగభద్ర గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు గోడను ఢీకొంది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కొమరాడ ఎస్ఐ నీలకంఠం సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని గల కారణాలు తెలుసుకున్నారు. విద్యార్థులంతా క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వారందరినీ వారి స్వగృహాలకు తరలించే ఏర్పాటులను ఎస్ఐ దగ్గరుండి చేపట్టారు.



కల్వర్టును ఢీకొన్న బస్సు

భూ హక్కు పత్రాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: అతుకుబడి భూములకు (ఫ్రీ హోల్డ్) రీ సర్వే చేసి అర్హులకు హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.అప్పారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు 2003కు పూర్వం అందజేసిన డీపట్టాలు, ఆయా లబ్ధిదారులు/ వారసుల ఆధీనంలోనే ఉన్నాయా లేదా అనే అని క్షేత్రస్థాయిలో పరిశీలన (ఫ్రీ హోల్డ్ ఎస్సైన్మెంట్) చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వీఆర్వో బి.హరికృష్ణ, సర్వేయర్ తేజావతి పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు

భామిని: ప్రకృతి సాగు విధానంలో పంటలు పండించడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని వెలుగు రిసోర్స్‌పర్సన్ ఎ. చిరంజీవిరావు అన్నారు. మండలంలోని పాలవలసలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగాన్ని బాగా తగ్గించాలని సూచించారు. ద్రవజీవామృతం తయారు చేసుకుని, వినియోగించాలన్నారు. ఎ.రామారావు, బి.పకీరు, కె.శైలజ, కె.శారద, అడవితల్లి ఎఫ్‌బీఓ సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.